క్లుప్తంగా

బ్యాంకు ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ గోవిందరెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జాగురూకత అవగాహన వారోత్సవాల్లో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఉద్యోగులు మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్త నిధిలో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు ఉప ప్రాంతీయ అధికారి సురేంద్రగౌడ్ మాట్లాడుతూ రక్తం మనకు ప్రకృతి ప్రసాదించిన అత్యంత విలువైన బహుమతి అని, రక్తదానం చేయడం అంటే ఓ మనిషికి జీవన దానం చేయడమేనని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ కె.జి.గోవిందరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రారావు, విజిలెన్స్ అధికారి రాజశేఖర్, బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

సేవలకు సన్మానం

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, వారి సమస్యలపై నిరంతరం ఏదో ఒక రూపంలో ఉద్యమాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులకు అరుదైన గౌరవం దక్కింది. మంగళవారం హైదరాబాలోని రవీంద్రభారతిలో విశ్వ జన కళామండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న దళిత, బహుజన ఉద్యమ నేతలు మాస్టార్‌జీ, జేబీ రాజు, వలిగట్ల రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రముఖుల ఆధ్వర్యంలో చేసిన సన్మానం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



మృతిచెందిన బెల్లం ఆంజనేయులు

కర్నూలు : కల్లూరు మండలం ఈశ్వరప్ప నగర్‌లో నివాసముంటున్న బెల్లం ఆంజనేయులు (41) విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. ఈయన కల్లూరులోని ఆయిల్ మిల్లో కూలీగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. కల్లూరు మండలం శివప్ప నగర్‌లో ఉన్న సొంత స్థలంలో ఇటీవల కొట్టం నిర్మించుకుని సైడ్ గోడలకు కరెంటు మోటర్ ద్వారా క్యూరింగ్ చేస్తుండగా మంగళవారం ఉదయం మోటర్‌కు ఉన్న కరెంటు సప్లయ్ వైర్ కొద్దిగా తెగి ఆంజనేయులు పై పడటంతో సొమ్మసిల్లి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా ముక్కులో రక్తస్రావమై అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య కురువ బెల్లం వరలక్ష్మి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : ఎవరైనా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. మంగళవారం నగర శివారులోని జగన్నాథగట్టుపై బి.తాండ్రపాడుకు చెందిన దండోరా లక్ష్మణ్ ఇటాచీతో మట్టి తవ్వుతున్నారనే సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. మట్టి తవ్విన ప్రాంతాన్ని పరిశీలించారు. 840 క్యూబిక్ మీటర్లు మట్టి తవ్వారని గుర్తించారు. బాధ్యులపై కేసులు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. దాడుల్లో విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ భవన నిర్మాణాలపై వేటు



రిచ్‌మండ్ విల్లాస్‌లో డివియేషన్ నిర్మాణాలను నిలిపి వేసిన టౌన్ ప్లానింగ్ సిబ్బంది

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక కోడుమూరు రోడ్డులో ఉన్న రిచ్‌మండ్ విల్లాస్‌లో అనుమతులు లేకుండా (డివియేషన్) చేపడుతున్న నిర్మాణాలపై మంగళవారం నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వేటు వేశారు. పనులను నిలుపుదల చేశారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుండటంతో అడిషనల్ సిటీ ప్లానర్ రంగస్వామి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ శబరీష్, చైన్‌మన్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాల దారులకు రెండు సార్లు నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ప్లాన్‌కు విరుద్ధంగా పార్కింగ్ స్థలంలో నిర్మాణాలు చేపట్టిన వాటిని కూల్చేస్తామని హెచ్చరించారు.

తైక్వాండోలో బంగారు పతకం

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బుధవారపేట నారాయణ స్కూల్‌కు చెందిన విద్యార్థి యాసర్ బాషా అండర్–17 విభాగంలో బంగారు పతకం సాధించాడు. పాఠశాల ఏజీఎం రమేష్‌కుమార్, ఏఓ తిమ్మారెడ్డి ఆ విద్యార్థినిని మంగళవారం అభినందించారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్ పాల్గొన్నారు.







రన్ ఫర్ యూనిటీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగబాబు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ, నగర పాలక సంస్థ హైస్కూల్‌లో పటేల్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

జాతీయ సమైక్యతను చాటుదాం

- నగరంలో ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

కర్నూలు: కలిసికట్టుగా ఉండి జాతీయ సమైక్యతను చాటుదామని వక్తలు పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవం నిర్వహించారు. పలువురు పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీసు అమరవీరుల త్యాగాన్ని స్మరిస్తూ జాతీయ సమైక్యతను చాటుతూ జిల్లా పోలీసు యంత్రాంగం నగరంలో యూనిటీ ఫర్ రన్‌ను నిర్వహించింది. ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగబాబు 'ఏక్తా పరుగు' కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పోలీసు కార్యాలయం (కొండారెడ్డిబురుజు) నుంచి ప్రారంభమై రాజ్‌విహార్ కూడలి వరకు ఈ ర్యాలీ సాగింది. అక్కడికి చేరుకున్న సివిల్, ఏఆర్ పోలీసు సిబ్బందిచే ఏఆర్ అడిషనల్ ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని సందేశాన్ని తోటివారిలో విస్తరింపజేయడానికి గట్టిగా కృషి చేస్తూ సత్యనిష్ఠతో ప్రతిజ్ఞ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐలు గుణశేఖర్ బాబు, పవన్ కుమార్, రామయ్య నాయుడు, నాగశేఖర్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎస్పీ పటాలం ఆధ్వర్యంలో...

పోలీసు అమరవీరుల వారోత్సవాలు–2023 ముగింపు సందర్భంగా మంగళవారం ఏపీఎస్పీ రెండవ పటాలం సిబ్బంది బెటాలియన్ మెయిన్ గేట్ నుంచి రాజ్‌విహార్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. పటాలం సిబ్బంది, అధికారులు, హోంగార్డ్స్ ర్యాలీలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులకు జోహార్లు అర్పిస్తూ శాంతి నినాదాలు చేస్తూ బెటాలియన్ ప్రధాన గేటు నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అసిస్టెంట్ కమాండెంట్లు మహబూబ్ బాషా, శ్రీనివాసరావు, డీఎస్పీ భక్తవత్సలం, ఆర్ఐలు పోతల రాజు, రమణ, శివారెడ్డి, పైడిరాజు, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, నారాయణ, సాయికుమార్, ప్రసాద్, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



నగరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీఎస్పీ పటాలం సిబ్బంది

దేశ ఐక్యతకు కృషి చేద్దాం

కర్నూలు (టౌన్) : సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశ ఐక్యతకు కృషి చేద్దామని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. మంగళవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో జాతీయ ఐక్యత దినోత్సవం నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. మున్సిపల్ ఉద్యోగులతో దేశ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు.

విద్యా సంస్థల్లో..

కర్నూలు సిటీ: స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డా.వి.వి.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఆర్ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.



ఆర్‌యూలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ ఆనందరావు, రెక్టార్, రిజిస్ట్రార్

- స్థానిక బి. క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో ఆ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్, అధ్యాపకులు ప్రసన్నకుమార్, రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, జబీన్, అక్తర్, సుజాత, లక్ష్మీ, చిన్న మల్లేశ్వరుడు, ఉల్లోజి రావు, పాల్గొన్నారు.
- ఎస్‌ఏపీ క్యాంపులోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక సంస్థ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరెడ్డి, సోషల్ టీచర్లు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.
- సీఎస్‌ఈ ఫార్మసీ కాలేజీలో ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో పటేల్ జయంతి వేడుకలు నిర్వహించారు. డా.పి. రవి ప్రకాష్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కర్నూలు (న్యూసిటీ): సర్దార్ వల్ల భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఆర్‌యూలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ ఆనందరావు మాట్లాడుతూ పటేల్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రెక్టార్ సీవీ.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానందపుచ్చ, ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ అరుణ, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉక్కు మనిషి పటేల్



వల్లభాయ్ పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈఓ, సిబ్బంది

కర్నూలు(అర్బన్): భారతదేశ ఉప ప్రధానిగా, కేంద్ర హోం శాఖా మంత్రిగా విధులు నిర్వహించిన సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ ఉక్కు మనిషిగా పేరు గాంచారని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ మాట్లాడారు. పటేల్ స్వాతంత్ర్య సమరయోధుడిగానే కాకుండా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం పలు సంస్థానాలను విలీనం చేశారన్నారు. దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను కూడా నిర్వహించారన్నారు. డా.బీఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం రచనలో కూడా సర్దార్ పటేల్ ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలిలో హోం శాఖను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఆయన దేశానికి అందించిన సేవలకు గుర్తుగా భారత ప్రభుత్వం 1991లో భారతరత్న బిరుదును ఇచ్చి గౌరవించిందన్నారు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు జితేంద్ర, బసవశేఖర్, రాంగోపాల్, కే సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ సేవలు నిలుపుదల

- ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిన అధికారులు
- విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడమే కారణం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశించినా విద్యుత్ బిల్లులు చెల్లించకుండా ఉన్న ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ మిషన్ నిర్వాహకులపై వేటుపడింది. మంగళవారం ఆసుపత్రికి వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన ముందుగా ఎంఆర్‌ఐ, సీటీస్కాన్‌ల విద్యుత్ బకాయిలపై ఆరా తీశారు. మొక్కుబడిగా కొద్దిమొత్తం చెల్లించారని, ఇంకా ఎంఆర్‌ఐ వారు రూ.56.91లక్షలు, సీటీస్కాన్ వారు రూ.26.29 లక్షలు చెల్లించాల్సి ఉందని, పలుమార్లు పిలిచి చెప్పినా వారు బకాయిలు చెల్లించడం లేదని ఆసుపత్రి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వెంటనే ఎంఆర్‌ఐ, సీటీస్కాన్ మిషన్ల సేవలు నిలుపుదల చేయించాలని ఆసుపత్రి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ మిషన్ సేవలను ఆసుపత్రి అధికారులు ఆపు చేయించారు. తాత్కాలికంగా ప్రత్యామ్నాయ చర్యలు సైతం తీసుకున్నారు. ప్రైవేటు స్కానింగ్ కేంద్రాల ద్వారా సీటీ స్కాన్ సేవలు అందించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో డయాగ్నోస్టిక్ బ్లాక్‌లో కొత్తగా ఏర్పాటైన సీటీ స్కాన్ మిషన్ సిద్ధమైందని, బుధవారం మధ్యాహ్నం నుంచి దానిని ప్రారంభించి సేవలు అందిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి చెప్పారు. ఎంఆర్‌ఐ స్కాన్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ నిర్వాహకులకు పలుమార్లు హెచ్చరించినా వినకపోవడం వల్లే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇదిలాఉంటే సేవలు ఆగిపోయిన సీటీస్కాన్ మిషన్ కేంద్రం ముందు మంగళవారం సాయంత్రం సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు.

డా.పుల్లన్న ఆశయ సాధనకు కృషి

కర్నూలు(అర్బన్): జిల్లాలో కురువ సంక్షేమ సంఘం అభివృద్ధికి ఎనలేని సేవలు అందించిన దివంగత డా.పుల్లన్న ఆశయాలను సాధించేందుకు కృషి చేస్తామని సంఘం జిల్లా అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం డా.పుల్లన్న ద్వితీయ వర్ధంతి సందర్భంగా స్థానిక టీజీవీ కళాక్షేత్రం సమావేశ భవనంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నగర శివారుల్లోని జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఉన్న మానసిక వికలాంగుల శరణాలయంలో పుల్లన్న కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, నగర అధ్యక్ష, కార్యదర్శులు తవుడు శ్రీనివాసులు, బి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డా.పుల్లన్న చిత్రపటం ఎదుట నివాళులర్పిస్తున్న నేతలు

'సామ' పద్య నాటకం ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: జగదేక సుందరి 'సామ' అనే పద్య నాటకాన్ని మాజీ రాజ్య సభ సభ్యుడు టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. మంగళవారం ఆయన ఛాంబర్‌లో టీజీవీ కళాక్షేత్రం కళాకారులతో కలిసి నాటకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ నవలా రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచించిన రేడియో నాటకం ఆధారంగా ప్రముఖ రచయిత పల్లేటి కుల శేఖర్ సంభాషణలు, ఇందులో పద్యాలను కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య రచించారు. వీరు ఇరువురు కలిసి రచించిన ఈ పద్య నాటకాన్ని ఈ సంవత్సరం జరగబోయే నంది నాటకాలకు సిద్ధం చేస్తున్నారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నంది నాటక పోటీలకు ఒక కొత్త నాటకాన్ని తయారు చేయటం కళాక్షేత్రానికి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఒక వేశ్య ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకొని ఈ పద్య నాటకం రూపొందిందన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, రచయిత పల్లేటి కుల శేఖర్, కళాక్షేత్రం కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు రాముడు, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సామ నాటకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

సంక్షిప్తం

ఎస్‌జీఎఫ్ రైఫిల్ షూటింగ్‌లో జిల్లాకు పతకాలు

కర్నూలు (టౌన్) : రాజమండ్రి పట్టణంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 5 పతకాలు సాధించారు. 2 బంగారు, 1 రజతం, 2 కాంస్య పతకాలు సాధించిన రైఫిల్ షూటర్లను మంగళవారం స్థానిక జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రంగారెడ్డి, ఏడీ శామ్యూల్ పాల్ అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య పాల్గొన్నారు

8న పూలబజార్ షాపులకు వేలం

కర్నూలు (టౌన్) : ఈనెల 8 వ తేదీ పూలబజార్‌లో షాపులకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 100 చదరపు అడుగులతో 8 షాపులు,170 చదరపు అడుగులతో 16 షాపులు, 110 చదరపు అడుగులతో 14 షాపులకు వేలం ఉంటుందని తెలిపారు. వేలంలో పాల్గొనే పాటదారుడు రూ.2 లక్షలు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

కర్నూలు (టౌన్) : నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. మంగళవారం స్థానిక వెంకటరమణ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, చిల్డ్రన్స్ పార్కు అభివృద్ధి, కేసీ కెనాల్ వద్ద అభివృద్ధి చేస్తున్న చిరు వ్యాపారుల సముదాయం, కెనాల్ బండ్ అభివృద్ధి, సుందరీకరణ పనులను కమిషనర్ పరిశీలించారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషసాయిని పనుల ప్రగతి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

కర్నూలు(సెంట్రల్): దేశ స్వాతంత్రం కోసం పోరాడిన ఏకైక జాతీయ కార్మిక సంస్థ ఏఐటీయూసీ అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. మంగళవారం ఆ సంఘం 104 వ్యవస్థాపక దినోత్సవాన్ని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా కార్మిక జెండాను ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.చంద్రశేఖర్, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, గణేస్, రాము, డీసీరహమాన్ పాల్గొన్నారు.

నేడు సచివాలయాల ప్రారంభం

కల్లూరు: మండల పరిధిలోని పర్ల గ్రామ సచివాలయం–1, సచివాలయం–2 భవనాలను ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నారు. అనంతరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని ఎంపీడీఓ రమణమూర్తి మంగళవారం తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిషిప్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్) : రోడ్డు రవాణా సంస్థలో అప్రెంటిషిప్ చేసేందుకు ఐటీఐ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జోనల్ శిక్షణ కళాశాల మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో కోరింది. కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య జిల్లాల్లో డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మోటర్ మెకానిక్, వెల్డర్, పెయింటర్, మిషనిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ విభాగాల్లో ఖాళీగా ఉన్నాయని, ఆయా విభాగాల్లో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులు అప్రెంటిషిప్ ఇండియా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వివరాలకు 7382869399, 7382873146 నంబర్లకు సంప్రదించాలని తెలిపింది.

అనాథాశ్రమానికి దుస్తులు, సరుకుల వితరణ

కర్నూలు(హాస్పిటల్): డేనియల్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్నూలులోని కీర్తన అనాథాశ్రమానికి మంగళూరు వాస్తవ్యులు మోహన్‌దాసు, మీనాక్షి దుస్తులు, నిత్యావసర సరుకులు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ ఫౌండర్ సుమన్, సభ్యులు దివాకర్, ప్రశాంత్, రోహిత, డేవిడ్, మాధురి, కుమార స్వామి, ఆశ్రమం నిర్వాహకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంపూర్ణ ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

కర్నూలు (టౌన్) : సంపూర్ణ ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, 24 వ వార్డు ఇన్‌చార్జ్ ఆసిఫ్ సయ్యద్ అన్నారు. మంగళవారం స్థానిక మద్దూర్‌నగర్‌లోని మాస్టర్స్ కళాశాల ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రోగుల అన్ని ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కన్వీనర్లు అబ్బాస్ అలీ, ఖాన్, సుచరిత, వైఎస్ఆర్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు కేదార్‌నాథ్, డాక్టర్ గోపీ, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

ఈ–శ్రమ్ గుర్తింపు కార్డుల ప్రక్రియ వేగవంతం

కర్నూలు(రాజ్‌విహార్) : అసంఘటిత రంగ కార్మికులు ఈ–శ్రమ్ కార్డులు పొందే ప్రక్రియను వేగవంతం చేయాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆయన మంగళవారం సాయంత్రం డీఎస్‌ఓ ఆచార్యులును కలసి ఈ–శ్రమ్ నమోదులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్క అసంఘటిత కార్మికుడు ఈ–శ్రమ్ పొందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌ఓ కేశన్న పాల్గొన్నారు.

బ్యాంకులను జాతీయం చేసిన ఘనత ఇందిరాకే సొంతం

కర్నూలు(సెంట్రల్) : దేశంలో 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు రుణాలు ఇప్పించిన ఘనత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీకే దక్కుతుందని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జాన్ విల్సన్ అన్నారు. సర్దార్ వల్లాభాయ్ పటేల్ వీరోచిత పోరాటంతోనే తెలంగాణకు నిజాం రాజు నుంచి విముక్తి లభించిందని, దేశానికి అత్యుత్తమ హోంమంత్రిగా పనిచేసిన వీరుడు అని కీర్తించారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ 39వ వర్ధంతి, పటేల్ 148వ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఇద్దరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు డిప్యూటీ డీఈఓను సస్పెండ్ చేయాలి

కర్నూలు సిటీ: ప్రైవేటు పాఠశాలలకు కొమ్ముకాస్తూ, ధనార్జనే ధ్యేయంగా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్న కర్నూలు డిప్యూటీ డీఈఓను సస్పెండ్ చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయం ఎదుట టీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్యాశాఖ నియమ నిబంధనలకు అనుగుణంగా కర్నూలు డివిజన్ పరిధిలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లు పని చేయడం లేదని, పర్యవేక్షణ చేయాల్సిన అధికారి ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఫీజులు అడ్డగోలుగా వసూలు చేస్తున్నారన్నారు.

15న విజయవాడలో సీపీఎం భారీ బహిరంగ సభ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ దావాలే

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సీపీఎం ఆధ్వర్యంలో బస్సు యాత్రలు ప్రారంభించామని, ఇవన్నీ 15వ తేదీన విజయవాడ చేరుకుంటాయని.. ఆదే రోజు బహిరంగ సభలో జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి పాల్గొంటారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ దావాలే ఆరోపించారు. మంగళవారం ఆయన కర్నూలులో విలేకరులతో మాట్లాడారు. లాల్ బహదూర్ శాస్త్రి రైల్వేమంత్రిగా ఉన్న సమయంలో ప్రమాదం జరిగితే తన పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఏ మంత్రీ ఆ ధైర్యం చేయలేకపోతున్నారని విమర్శించారు. కరువు రాష్ట్రాన్ని ఆదుకోవడంలో కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కర్నూలు జిల్లాలో ఉపాధి హామీ పనులు 150 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఐక్యరాజ్య సమితిలో పాలస్తీనా, ఇజ్రాయెల్ యుద్ధం విషయంలో భారత్ ఓటింగ్‌కు దూరంగా ఉండడం అమెరికా పెత్తందారీ విధానాలను బలపరచడమేనన్నారు. పాలస్తీనాలో ముస్లింలు ఉండడంతో బీజేపీ ఇజ్రాయెల్‌కు మద్దతిస్తోందని విమర్శించారు.

అక్రమ రవాణాపై మరింత నిఘా పెంచండి



సుంకేసుల చెక్‌పోస్టులో తనిఖీ చేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఆంధ్ర, తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టులలో నగదు, మద్యం, అక్రమ రవాణాపై మరింత నిఘా పెంచాలని ఎస్పీ కృష్ణకాంత్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా సరిహద్దులో ఉన్న సుంకేసుల బార్డర్ చెక్‌పోస్టును ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమ రవాణా జరగకుండా గట్టి చర్యలు చేపట్టాలని అక్కడి విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి సూచించారు. కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, కోడుమూరు సీఐ మన్సురుద్దీన్ తదితరులు ఎస్పీ వెంట ఉన్నారు.